రాష్ట్రమంతటా నమ్మకమైన సంస్థగా పేరుపొంది అనేక శాఖలుగల ఫైనాన్స్ కంపెనీ- కాకినాడ శాఖలో- బ్రాంచి మేనేజర్‌గా గోపాల్ వస్తున్నాడన్న వార్త సంచలనం అయింది. గుంపులు గుంపులుగా అందరూ అతని గురించే కబుర్లు.

కథ

రాధాదేవి ఒక్కతే కాబిన్‌లో లెడ్జర్ చూసుకుంటూ-ఆ కామెంట్స్ వేపు ఒక చెవి వేసి ఉంచింది.

ఆరు నెలలుగా మేనేజర్ లేని ఆఫీస్‌లో ఇన్‌ఛార్జిగా వెలిగిపోతున్న కృష్ణ-స్థానికుడు. కాస్త ఆస్థి, కూస్త పలుకుబడి గలవాడు. తనెవరూ ఏమీ చేయలేరన్న దురహంకారి. భార్యని ఒదిలేశాడు. రాధాదేవి కూడా అత్తింటి నుంచి వచ్చేసి రెండేళ్ళయింది. ఒంటరిగా ఉంటోంది.




నీకూ నీ వారు లేరు, నాకూ నా వారు లేరు, రంగ మెల్లి పోదాం రావే నా రంగుల బొమ్మా! అని రాధాదేవి వినేట్టు వెకిలి పాటలు పాడడం కృష్ణ హాబీ. అతనికి వత్తాసుగా భజన బృందం పిచ్చివేషాలు వేయడం నిత్య కృత్యం. మందలిస్తే మరింత రెచ్చిపోతారని మౌనంగా భరించడం అలవాటు చేసుకుంది రాధాదేవి.

గత మేనేజర్ వాళ్ళని అదుపు చేయలేక బదిలీ చేయించుకొని వెళ్ళిపోతే ఆ బ్రాంచి విఖ్యాతి విని మరెవరూ అక్కడకు రావడానికి సాహసించలేదు. కృష్ణ, అతని భజన బృందం ఆగడాలతో కంపెనీ ప్రతిష్ట దిగజారి లాభాలు క్షీణించి, కొత్త పెట్టుబడులూ రావడం లేదు. త్వరలోనే కాకినాడ బ్రాంచి మూసేస్తారని పుకారు షికారు చేస్తున్న తరుణంలో కొత్త మేనేజర్ వస్తున్నాడన్న వార్త సంచలనమే.

''వస్తే రానీ! వాడు మనల్నే చేయగలడు!'' విలాసంగా టేబుల్ మీద కూర్చుని కుర్చీలోకి కాళ్ళు చాపుకుంటూ అన్నాడు కృష్ణ.

''వాడేదో చేస్తాడని కాదు! మన ఆఫీసులో ఒంటరి పక్షులు ఎక్కువైపోతున్నాయని బాధ! నువ్వు ఒంటరి..రాధా ఒంటరి..ఇప్పుడొస్తున్న గోపాల్-పెళ్ళాం ఒదిలేసిన బాపతు!'' అన్నాడు కుడిభుజం నవ్వుతూ.

''అయితే యికపై మన ఆఫీసులో ఒక రాధ-ఇద్దరు కృష్ణులన్న మాట!' అన్నాడు ఎడమ భుజం. అంతా ఘొల్లుమన్నారు రాధవైపువంకరగా చూస్తూ.

రాధాదేవి లెడ్జర్‌లోకి మరింతగా కూరుకుపోయింది. ఛీ, వెధవ జీవితం! దుఃఖం ముంచుకు రాగా రెండు చేతుల్లోనూ ముఖం దాచుకొని గతంలోకి జారిపోయింది.

★★★

ఆమె కాలేజీ చదువు పూర్తి కాగానే యిటు వివాహం అయింది రాధకు. ఆమెకు బోలెడు ఆత్మ విశ్వాసం. అందగత్తెనని కించిత్ గర్వం. అయినా కొత్తకాపురం కొంత కాలం హాయిగానే సాగింది. భర్త వేణు కూడా అందగాడు, మంచివాడు.

అయితే ఉమ్మడి కుటుంబంలో కొత్తకోడలికి సాధక బాధకాలు, సమస్యలూ తప్పవు. ఇంటింటి రామాయణం ఉండనే వుంటుంది. బెడ్ రూంలో-మీ అమ్మ యిలా తిట్టింది, మీ చెల్లి యిలా చేసింది..అంటూ వేణుకి రిపోర్ట్ చేసేది రాధ.

''చూశావా, మీ అమ్మ మీ చెల్లి-అంటున్నావు గాని మా అత్త, మా ఆడపడుచు అనలేకపోతున్నావ్! వేరే వ్యక్తి లాగ కాక ఈ కుటుంబంలోని వ్యక్తిగా ఆలోచించి చూడు. ప్రతి తల్లికీ తన భవిష్యత్తు గురించి బెంగ, కొడుకుని కోడలు కొంగున ముడేసుకుని తన నుంచి దూరం చేస్తోందని భయం ఉంటుంది. ఆ భయంతో కోడల్ని వేధిస్తుంది. రేపు మీ తమ్ముడికి పెళ్ళయితే మీ అమ్మ కూడా మా అమ్మలానే ప్రవర్తిస్తుంది చూస్తూ ఉండు! దీనికి పరిష్కారం నీ చేతిలోనే ఉంది రాధీ! ఆమెను అత్తగారిలా కాక అమ్మలాగ చూసుకో. మీ అబ్బాయి మీ నుంచి దూరం కాడు. మనమంతా కలిసే వుంటాం-అన్న భరోసా కలిగేటట్టు ప్రవర్తించు. అలా అయితే యింక అమ్మ నుంచి సమస్యలుండవు'' అంటూ ఉపన్యాసమే యిచ్చాడు.

అతడు చెప్పింది రాధకు సబబుగానే తోచినా, రాధ తల్లి మాత్రం ఒప్పుకోలేదు. ఉమ్మడి కుటుంబం ఎప్పటికీ నరకమే. హాయిగా ఉండాలన్నా, పుట్టబోయే బిడ్డల ముచ్చట్లు తీర్చాలన్నా వేరింటి కాపురమే బెస్ట్- అంటూ రాధ తరఫున తానే రంగప్రవేశం చేసిందామె.

దానితో వేణు తల్లి కూడా గజ్జెకట్టక తప్పలేదు. అక్కడ నుంచి తకిధిమి తోం...అలనాటి సినిమాల్లో ఛాయాదేవి, సూర్యకాంతంలాగ అమ్మలు విజృంభించగా ఆ అమ్మల చేతిలో బొమ్మలే అయ్యారు-వేణు, రాధ. తెగేదాకా లాగవద్దని ఆ మాతృమూర్తులకు ఎవరూ సలహా యిచ్చే సాహసం చేయలేకపోయారు.

అంతే. కొన్నాళ్ళుగా ఆ ఇంటికీ ఈ ఇంటికీ రాకపోకలు లేవు.

రాధ పుట్టింటికి వచ్చేశాక కొంతకాలం హాయిగానే వుంది. తమ్ముడి పెళ్ళి, చెల్లి పెళ్ళి జరిగాకనే సమస్యలు పుట్టుకొచ్చాయి.


కొడుకు చేయి దాటిపోతాడేమోనన్న భయంతో సూర్యకాంతమ్మ కోడల్ని అదుపులో పెట్టడానికి ప్రయత్నించడం, కోడలు ఎదిరించడం, చిలికి చిలికి గాలివాన-చివరకు వేరింటి కాపురం-చకచకా జరిగిపోయాయి.

తర్వాత కొన్ని రోజులకు పుట్టింటికి వచ్చిన చిన్న కూతురు రమణిని-మీరెప్పుడు వేరింటి కాపురం పెడతారే-అని అడిగింది సూర్యకాంతమ్మ.

రాధకంటే రమణి కాస్త తీవ్రవాది. ''అమ్మా! నీకు బుద్ధి ఉందా? కొడుకు వేరింటి కాపురం పెట్టినందుకు తిట్టిపోస్తున్న నోటితోనే నన్నూ వేరింటి కాపురం పెట్టమంటున్నావ్! అక్క కాపురం కూల్చి ఇంక నామీద పడ్డావా? ఉమ్మడిలో మేము హాయిగానే వున్నాం. మా సంసారంలో తల దూర్చకు. నీవు చెప్పినట్టల్లా తైతక్కలాడడానికి నేను అక్కలాగ చవటను కాదు'' అని తెగేసి చెప్పేసింది.

దానితో రాధ కళ్ళు తెరిపిళ్ళు పడ్డాయి. చెల్లికున్న తెలివి, వివేకం తనకు లేకపోయాయి.

కాపురం కూల్చుకుని తను సాధించింది ఏమిటన్న ఆలోచనలో పడింది. ఆయన మరో పెళ్ళి చేసుకొని హాయిగా ఉండి వుంటాడు. తనకు మిగిలిందేమిటి? సూటిపోటి మాటలతో కుళ్ళబొడిచే అమ్మలక్కల మధ్య ఒంటరి జీవితం! తెలివి



తక్కువ పనిచేసినందుకు
తనని తానే నిందిం
చుకోసాగింది
రాధ. పశ్చాత్తా
పంతో దహిం
చుకుపో
తోంది.

తిట్టే నోరు
తిన్నగా ఉండదు.
కొడుకూ,
చిన్న

కూతురూ తనని ధిక
రించి పోవడంతో–ఇంటిలో ౦గి
లిన భర్త, రాధల మీద విరు కు
పడడం మొదలుపెట్టింది సు ్యకాం
తమ్మ. అత్తగారి తిట్లకు కో ంచుకున్న
రాధకు పుట్టింటిలోనూ తిట్ల తప్పలేదు! అమ్మ
తిట్లు ఒకప్పుడు కమ్మగా ఉ వేమోగాని
యిప్పుడు మాత్రం తూట్లు ాడుస్తున్నట్టుగా
వున్నాయి.

అదృష్టవశాత్తు ఫైనాన్స్ కంపెనీ కాకినాడ
బ్రాంచిలో ఉద్యోగం దొ కడంతో పుట్టింటి
నరకం నుంచి బయటపడి వ )సిన రాధకు ఆఫీసు
లోనూ
మనశ్శాంతి కరువైంది–ఈ కోతిమూక వల్ల. ఛీ
వెధవ జీవితం! చావాలనిపిస్తోందామెకు.

★★★

ప్రఫుల్లచంద్ర

కొత్త మానేజర్ గోపాల్ వచ్చి చేరాడుగాని ఆఫీసు ఏమీ మారలేదు. ఆతగాడు ఆఫీసుకెప్పుడు వస్తాడో, ఎప్పుడు వెళ్ళిపోతాడో ఎవరికీ తెలియదు. ఊరంతా చుట్టబెట్టడమే అతని పనిలా గుంది.

అలా పది రోజులు గడిచాక–ఓ సాయంకాలం అలవాటుగా కృష్ణ టేబుల్ మీద కూర్చుని కుర్చీ మీదకు కాళ్ళు చాపుకొని రన్నింగ్ కామెంటరీ మొదలు పెట్టాడు.

''ఆ గోపాల్‌గాడి సంగతి నాకు తెలుసురా. ఆడామగా కాని వెధవ! అందుకే వాడి పెళ్ళాం నాలాంటి మగాడితో లేచిపోయింది! వాడు మనల్నేం చేస్తాడురా!''

హఠాత్తుగా లోనికి దూసుకొచ్చిన గోపాల్ అతని షర్ట్ కాలర్ దొరక బుచ్చుకొని కిందకీడ్చి పిడికిలి బిగించి దౌడ మీద పిడి గుద్దొక్కటిచ్చాడు. గిరికీలు కొడుతూ కృష్ణ అంతదూరంలో పడగా అందరూ చటుక్కున లేచి బొమ్మల్లా ఉండిపోయారు.

వాళ్ళు ద్రిగ్భ్రాంతి నుంచి కోలుకోకముందే మరో విభ్రాంతి!

పోలీసులు బిలబిలా లోనికొచ్చి–కృష్ణని అరెస్ట్ చేసి తీసుకెళ్ళడం!

కృష్ణని ఎందుకు అరెస్ట్ చేశారో మర్నాడు

పేపర్ చూస్తేగాని ఎవరికీ అర్థం కాలేదు.

"స్థానిక ఫైనాన్స్ కంపెనీ ఇంఛార్జిగా వున్న ఒక ఉద్యోగి-ఇద్దరు బినామీ వ్యక్తులకు అప్పులిచ్చినట్లు రికార్డులో చూపించి రెండు లక్షలు కైంకర్యం చేశాడనీ, ఖాతాదారులిచ్చిన డబ్బు పాస్ బుక్కులో నమోదు చేసి లెడ్జర్‌లో చేయకుండా మరో యాభై వేలు కాజేశాడని-కొత్త మానేజరు డ్యూటీలో చేరుతూనే అకుంఠిత దీక్షతో ఖాతాదారులందరి యిళ్ళు సందర్శించి సాక్ష్యాలు సేకరించి పోలీస్ రిపోర్ట్ యిచ్చినట్లు ప్రజలు చెప్పుకుంటున్నారు. కొత్త మానేజర్ రాకతో కంపెనీ మళ్ళీ పూర్వవైభవం సంతరించుకుంటుందని ప్రజలు ఆశిస్తున్నారు"- అదీ వార్త.

అంతే. ఒక్క నెలలో ఆఫీసు వాతావరణం పూర్తిగా మారిపోయి క్రమశిక్షణ నెలకొంది. డిపాజిట్లు పెరిగాయి. అల్లకల్లోలంగా వున్న ఆఫీస్‌ని ఆర్డర్‌లో పెట్టి మగాడనిపించుకున్న గోపాల్ పట్ల సదభిప్రాయం కలిగినా అతని ఎదుటపడి మాట్లాడే ధైర్యం చేయలేకపోయింది రాధాదేవి.

డిపాజిట్లు ఇంకా పెంచడానికి సిబ్బందిలో ఎవరో ఒకర్ని వెంట బెట్టుకుని ఆఫీసు అయాక సాయంకాలం ఒక గంట ఇంటింటికీ తిరిగి ప్రచారం మొదలుపెట్టాడు గోపాల్.

"ఈరోజు మీ వంతు. నాతో వస్తారా రాధాదేవీ!" అడిగాడు గోపాల్ ఓరోజు.

ఆమె సంశయిస్తూ నిలబడిపోయింది. "నేనంటే యిష్టం లేదు కాబోలు సర్లెండి. మరొకర్ని తీసుకెళ్తా" అన్నాడు గోపాల్. తటాపటాయింపు మాని అతనితో బయలుదేరింది రాధాదేవి.

ఆ రోజు రికార్డ్ కలక్షన్-యాభైవేలు! పొంగిపోయిన గోపాల్ "చూశారా మీరు నాతో జతకడితే.." అని అర్థాంతరంగా ఆగిపోయాడు.

ఆమె తల వంచుకొని స్కూటర్ వెనక కూర్చుంది.

ఆలయం వద్ద స్కూటర్ ఆపాడు. ఇద్దరూ దైవ దర్శనం చేసుకొని నందివర్ధనం చెట్టుకింద కూర్చున్నారు. చాలా కాలం తర్వాత మనసుకెంతో ప్రశాంతంగా అనిపించింది రాధాదేవికి. కాని ఒక్క క్షణం గడిచాక-

"నీకూ నీ వారు లేరు. నాకూ నా వారు లేరు.." కూనిరాగం తీశాడు గోపాల్ ఆమెవైపు కొంటెగా చూస్తూ.

రాధాదేవి గుండె ఝల్లుమంది. కృష్ణలాంటి బేవార్స్ కాదు గోపాల్-అని ఆమెకు తెలుసు. కాని...

అంతలోనే గోపాల్ గంభీరంగా మారిపోయి.."రాధా! నేను మానేజర్‌గా యిక్కడకొచ్చిందే నీకోసం! నీకభ్యంతరం లేకపోతే..." అర్థోక్తిలో ఆగాడు.

ఉలిక్కిపడి, చటుక్కున లేచి అతని వంక అయోమయంగా చూసి చరచరా వెళ్ళిపోయింది రాధాదేవి.

★★★

ఆదివారం...

సాయంకాలం నాలుగు...

కాలింగ్ బెల్ విని తలుపు తెరిచిన రాధాదేవి షాక్ అయింది.

ఎదురుగా అత్తగారు!

"నన్ను క్షమిస్తావా తల్లీ?" అంది ఛాయదేవి వర్షిస్తున్న కళ్ళతో.

చటుక్కున వంగి అత్తగారి పాదాలకు నమస్కరించి సాదరంగా లోనికి తీసుకు వెళ్ళిందామెను రాధాదేవి.

రెండేళ్ళుగా ఛాయదేవి కొడుక్కి మరో పెళ్ళి చేయాలనే ప్రయత్నించింది. కానీ-


"కొత్త పెళ్ళాం మాత్రం నన్నెత్తుకుపోదని గ్యారంటీ ఏముందమ్మా? కన్న కూతురు ఎన్ని తప్పులు చేసినా ఉదారంగా క్షమించే నువ్వు-కోడలు చిన్న తప్పు చేస్తే సహించలేవు. అలాగే కన్నతల్లి కొట్టినా తిట్టినా పడివుండే అమ్మాయి, అత్తగారు చిన్న మాటంటే చాలు ఎదురు తిరుగుతుంది. ఎవరూ సర్దుకుపోరు. మళ్ళీ పాత సమస్యలే. మళ్ళీ విడిపోవడమే. ఇదంతా ఎందుకమ్మా! ఇక పెళ్ళి మాట తలపెట్టకు" అని భీష్మించాడు కొడుకు.

కొట్టలేదు. తిట్టలేదు. మనసులో మాట సూటిగానే చెప్పాడు- నువ్వు మారనంతవరకూ నా పెళ్ళి జరగదని!

చెట్టంత కొడుకు మోడువారితే-అలా వాడు మోడువారిపోవడానికి తనే కారణం అయితే ఏ తల్లిమాత్రం తట్టుకోగలదు!

రాజీ కోసం కోడలి యింటికి కదలి వచ్చిందామె.

"మీరే నన్ను క్షమించాలత్తయ్యా! కొద్దికాలం ఓపిక పట్టమని ఆయన చెప్పినా వినకుండా తెగే దాకా లాగి తెంపరినయాను. తప్పంతా నాదే" అంది రాధాదేవి.




ఆమె స్వరంలోని మార్దవం, ఆత్మీయతా నిండి పొంగిపోయిన అత్తగారు కోడల్ని హృదయానికి హత్తుకుంది.

"ఈ శుభ సందర్భంలో నాకొక కప్పు కాఫీ ఇవ్వొచ్చు కదా!"

అత్తా, కోడలూ ఉలిక్కిపడి గుమ్మం వైపు చూశారు.

గుమ్మంలో గోపాల్! కాదు..వేణు! కాదు, కాదు..వేణుగోపాల్!

ఒక్కసారిగా సిగ్గు ముంచుకొచ్చి రాధ ముఖం రాగరంజితం అయింది. కాఫీ తెచ్చే మిషతో కిచెన్ లోకి చెంగున దూకింది.

తల్లీ కొడుకూ ప్రక్క ప్రక్కనే కూర్చున్నారు. కొడుకు ముఖంలో ఎంతో కాలానికి కనిపించిన ప్రసన్న భావం చూసి పులకించిపోయిందా కన్నతల్లి హృదయం.

కాఫీ తెచ్చి ఇచ్చిన రాధతో- "ఇవాళ మంచి రోజు. మనింటికి వెళదామా?" అంది అత్తగారు.

భార్య రెండేళ్ళ తర్వాత మొదటిసారిగా యిచ్చిన కాఫీని తన్మయంగా ఆస్వాదిస్తున్నాడు గోపాల్.

లేక లేక కలిసిన దంపతులకు ఏకాంతం కల్పించడానికి లోపలికి వెళ్ళింది ఛాయాదేవి.

చటుక్కున లేచి భార్యను హృదయానికి హత్తుకున్నాడు వేణు తమకంగా.

రెండేళ్ళ ఎడబాటు-ఎండలో నెరదలు వారిన వారి హృదయసీమల్లో హఠాత్తుగా తొలకరి జల్లు కురిసినట్టు కళ్ళు వర్షించాయి.

"నన్ను క్షమించరూ?" ఆర్తిగా అడిగింది రాధ.

"మనం చదువుకున్న వాళ్ళం. స్వతంత్రంగా ఆలోచించగల వాళ్ళం. సమస్యలొస్తే చర్చించి పరిష్కరించుకునే నేర్పు ఓర్పు ఉండాలి. మంచి, చెడూ స్వయంగా నిర్ణయించుకొని అమ్మల్ని మన మార్గంలోకి మలచుకోవాలిగాని, మనమే అమ్మల చేతిలో బొమ్మలై తైతక్క లాడకూడదు" మృదువుగా అన్నాడు వేణు.

బుద్ధి వచ్చింది-అన్నట్లుగా అతని చేతులతో తన చెంపలు సున్నితంగా వాయించుకుంది రాధ.

కూత మరిచిన కోకిల హఠాత్తుగా జ్ఞాపకం వచ్చినట్టు కుహూకుహూ రావాలు చేసింది.

★